ఆంధ్రజ్యోతి కెమెరామెన్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివకుమార్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డ వైసీపీ శ్రేణులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం ఏఎస్పీ ఆరిపుల్లకి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందిస్తూ వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు.

భూ రాబందులను వదలి..
పేదలపైనే ప్రతాపం

లారీ ఛార్జిలో గాయపడిన మహిళ

- జెసిబిలతో గుడిసెలు తొలగింపు
- అడ్డుపడిన వారిపై లాఠీఛార్జ్
- మహిళలపైనా పోలీసుల దౌర్జన్యం
- సీపీఎం నేతల "హౌజ్ అరెస్టు"లు
- పేదలకు న్యాయం చేయకుంటే ఉద్యమం ఉధృతం: నేతల హెచ్చరిక

జెసిబితో గుడిసెలను కూల్చుతున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి

కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములలో తిష్ట వేసిన భూరాబందులను వదిలి.... జానెడు ఇంటి స్థలం అడిగిన పేదలపై అటు అధికారులు, ఇటు పోలీసులు తమ ప్రతాపాన్ని చూపుతున్నారు. రేణిగుంట మండలం, కరకంబాడి ఎర్రగుట్టపై పేదలు వేసుకున్న గుడిసెలపై మంగళవారం తెల్లవారు జామున తమ జులుంను ప్రదర్శించారు. వందలాది పోలీసులు చొరబడి, జెసిబిలతో గుడిసెలను నేలమట్టం చేశారు. ప్రొక్లైన్లను అడ్డుకున్న పేదలపై లాఠీ చార్జ్ చేశారు. అంతకు ముందే సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, రేణిగుంట మండల కార్యదర్శి హరినాథ్, సిఐటియు మండల అధ్యక్షుడు నరసింహారెడ్డిని ముందస్తుగానే ఉదయం 3 గంటల నుంచే హౌజ్‌అరెస్ట్ చేసి ఇంటి నుంచి బయటకు రానీయకుండా నిర్బంధించారు. ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి సత్యశ్రీ, కమిటీ నాయకులు రాధిక, మునిబాబు, అరుణ్, మస్తాన్లను అరెస్టు చేశారు. అదే సమయంలో లాఠీ చార్జీతో స్పృహ తప్పిన సిపిఎం సీనియర్ నాయకులు శివానందంనూ విడిచిపెట్టలేదు. సీనియర్ కామ్రేడ్ వెంకట రమణపైనా దాడి చేయడంతో ఎడమ కాలికి తీవ్రగాయమైన విడవకుండా 'పేదలకు సపోర్టు వస్తారా మీ సంగతి తేలుస్తామంటూ దౌర్జన్యం చేశారు. పోలీసుల నిర్బంధం నుంచి బయటకు వచ్చిన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజాసంఘాల నేతలు రేణిగుంట పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పేదలకు న్యాయం చేయాల్సిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఇలా కుట్ర చేసి మరీ పేదలపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. పేదలకు న్యాయం చేసే వరకు సిపిఎం బాధితులకు అండగా ఉంటుందని ఉద్ఘాటించారు. వెంటనే పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేదలకు మద్దతుగా నిలుస్తాం: సిపిఎం, సిపిఐ

భూ కబ్జాలపై 1వ తేదీ వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం
వామపక్ష నాయకుల స్పష్టీకరణ

తిరుపతి (మంగళం): నిరుపేదలు గూడు కోసం చేస్తున్న పోరాటంపై అధికారులు మానవతా దృక్పదంతో వ్యవహరించాల్సింది పోయి పోలీసులను అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పేదల గుడిసెలను కూల్చుతారా అని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సిపిఎం, సిపిఐ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాగరాజు మాట్లాడుతూ రేణిగుంట మండలం కరకంబాడీ పంచాయతీలోని సర్వే నెంబర్ 153/1 ఎర్రగుట్టపై గత నెల రోజులుగా జగనన్న పట్టాలు పొంది స్థలాల కోసం ఎదురుచూస్తున్న అర్హులు గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తుంటే దాదాపు 600 మంది పోలీసులను, యంత్రాలను, ఫైర్ ఇంజన్లను పేదల గుడిసెల వద్దకు చేరుకొని ఒక్కసారిగా గుడిసెలను కూల్చివేయడం దారుణమన్నారు. ఇటు మంగళంలోనూ జగనన్న ఇళ్ళ పట్టాలు పొందిన వారికి అదే ప్రాంతంలోని చెన్నాయిగుంట సర్వే నెంబర్ 195/2లో స్థలాలను చూపాలని పోరాటం చేస్తే పోలీసులతో బలవంతపు అరెస్ట్‌లు చేయిస్తున్నారు. తిరుపతిలో కార్పొరేటర్లు, చంద్రగిరిలో, శ్రీకాళహస్తిలో నాయకులు వేల ఎకరాలు కబ్జాచేసి అమ్ముకోంటూ కోట్లు గడిస్తున్నారని, దోచుకున్న ఆయా కబ్జా భూముల్లో ఇది ప్రభుత్వ స్థలాలు అని బోర్డులు నాటే ధైర్యం అధికారులకు ఉందా అని సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అదికారులకు సూటిప్రశ్న వేశారు. జిల్లా కలెక్టర్ పేదల పక్షపాతిగా మెలగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలోని కూపుచంద్రపేటలో 200ఎకరాలకు పైగా భూఆక్రమణలు జరిగాయన్నారు. సాక్ష్యాత్తు తిరుపతి మేయర్ బంధువుల స్థలాన్ని కబ్జా చేసిన పట్టించుకోనే నాధుడేలేదన్నారు. నేడు అధికార పార్టీ నాయకులు చేస్తున్న భూకబ్జాలకు అధికారులు అండగా ఉండి మరీ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. నేడు జరుగుతున్న భూకబ్జాలు, పేదలకు స్థలాల అంశాలపై 1వ తేదీ శుక్రవారం సిపిఐ కార్యలయంలో వామపక్ష పార్టీల రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సిపిఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం, వేణుగోపాల్, బుజ్జి, మాధవకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, అమ్ములు, కుమారి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పెద్దలనొదిలేసి పేదలపైనే ప్రతాపం చూపడమేంటని సిపిఎం నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరకంబాడీలో పోలీసులు అర్ధరాత్రి పేదల ఇల్లు కూల్చడంపై మంగళవారం సిపిఎం నాయకులు అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కరకంబాడిలోని 600 కుటుంబాలకు మూడేళ్ల కిందట ఇంటి పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. అయితే ఇప్పటివరకు స్థలాన్ని చూపించలేదనీ, పేదలు ఎక్కడ నివసించాలని ప్రశ్నించారు. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే, పోలీసులకు గుడిసెలు కూల్చేయాలని ఆదేశించడం దుర్మార్గమని వాపోయారు. ప్రభుత్వం వెంటనే పేదలకు స్థలాలు చూపించాలని డిమాండ్ చేశారు. పెనగడం గురవయ్య, కుమార్, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా, రాజా, చిన్నబాబు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట మండలంలో సర్వే నెం. 153/1 నందు కరకంబాడీ ఎర్రగుట్ట పై సుమారు 5వేలు మంది గుడిసెలు వేసుకొని 33 రోజులుగా జీవనం సాగిస్తుంటే మంగళవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ నాయకత్వంలో పేదల గుడిసెలను తొలగించడం, పేదలపై లాఠీ ఛార్జి చేయడం దుర్మార్గమని ఈ ఘటనను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నామని రేణిగుంట మండల కార్యదర్శి కె.హరినాథ్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

ఎన్నికల విధులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలి
- ఆర్‌వో, నోడల్ అధికారుల సమీక్షలో జేసీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించడం కోసం ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులుతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలలో నోడల్ అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఈ నెల 29వ తేదీ నుండి నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులలో భాగంగా పూర్తి నిమగ్నం కావాలని తెలిపారు. కేటాయించిన విధులలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మొత్తం సిబ్బందిని మ్యాన్ పవర్ మేనేజ్మెంట్‌కు వారు గుర్తించడం, అధికారుల వివరాలను తీసుకోవడం, డేటాను అప్ లోడ్ ప్రక్రియ సకాలంలో వారిని నియమించడం చేయాలన్నారు. ఈవీఎంలను సరైనరీతిలో భద్రపరచాలని, ఈవీఎంల రాండమైజేషన్, ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్‌కి సంబంధించి ఎన్నికలలో ఉపయోగించాల్సిన అన్ని రకాల రవాణా అవసరాలకు అనుగుణంగా వాహనాలను గుర్తించాలన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలును పకడ్బందీగా చేసేలా ఎంసిసి టీం పని చేయాలన్నారు. ఈ సమీక్షలో డిఆర్‌ఓ బి.పుల్లయ్య, ఆర్‌డిఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జేపీసీ నాయకులపై అక్రమ కేసులు తగదు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపి అక్రమ కేసులు పెట్టిస్తోందని జేఏసీ, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు కెవి.రాఘవులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులపై అక్రమ కేసులను నిరసిస్తూ మంగళవారం స్థానిక ఏపీ ఎన్జీవో హోం ఎదుట జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి వివిధ రూపాల్లో జేఏసీ నేతృత్వంలో ఆర్థిక బకాయిలు చెల్లింపు ఇతర సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. చలో విజయవాడను జేఏసీ నాయకత్వం తాత్కాలిక వాయిదా వేసింది అని తెలిపారు. జేఏసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రఘు, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేయడంపై శిక్షణ ఇస్తాం..

- వ్యర్థాల నిర్వహణలో అవగాహన ఎంతో కీలకం
- పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ డాక్టర్ జె.అరుణ

పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేయడంపై పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తామని, వ్యర్థాల నిర్వహణలో ఈ ప్రక్రియ ఎంతో కీలకమని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అన్నారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో కమిషనర్ మాట్లాడారు. వ్యర్థాల సెగ్రిగేషన్‌పై అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని, ఇందుకోసం పారిశుద్ధ్య కార్మికులకు దశలవారీగా శిక్షణ ఇస్తామని, దృశ్యరూపం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యర్థాలను సేకరించే స్థలంలోనే తడి, పొడిగా సేకరించి నగరంలో వ్యర్థాల నిర్వహణలో పకడ్బందీగా చేపట్టాలన్నారు. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను, చేయకపోతే కలిగే నష్టాలను వివరించారు. తడి, పొడి వ్యర్థాలను ఇంటి వద్దనే వేరు చేసి అందించేలా గృహస్థులకు, వ్యర్థాల ఉత్పత్తిదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం కమిషనర్ వాహనాల షెడ్డులోని క్లాప్ ఆటోలను పరిశీలించారు. క్లాప్ ఆటోల నిర్వహణను పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్లాప్ ఆటోల ద్వారా క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, ఏఈలు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు జెసీ ఆదేశం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం చిత్తూరు నుంచి విడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్డీవోలు, తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు, డీటీలు, రీ సర్వే డీటీలు, గ్రామ సర్వేయర్లు, సచివాలయ కార్యదర్శులతో మాట్లాడారు. మ్యుటేషన్ కార్యక్రమంలో ఏవైనా తప్పులు దొర్లి ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని, ఆర్డీవో స్థాయిలో అనుమతి రావడం జరిగిందన్నారు. అసైన్మెంట్ భూములకు సంబంధించి రి వెరిఫికేషన్ చేసి అర్హులకు పట్టాలు అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధిగమించాల్సిన పద్ధతులను గురించి వివరించారు. ఫ్రీ హోల్డ్ రైట్స్‌కు సంబంధించి ఇంకా కొన్ని పూర్తి చేయాల్సి ఉందని వీఆర్వో స్థాయిలో పూర్తి అయి ఉంటే తహశీల్దార్ స్థాయిలో పూర్తిచేసి ఆర్డిఓ స్థాయిలో అనుమతి పొందాలన్నారు. రీ సర్వే 3వ దశలో ఇంకా కొన్ని పూర్తి చేయాల్సి ఉందని నిర్ణయించిన గడువు లోపల ఈ కార్యక్రమాలను త్వరితగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1500ఓటర్లకు పైబడి ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆపై ఉంటే ఆక్సిలరీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. తహశీల్దార్‌లు వెంటనే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పిఎస్ఎల్వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవనం ప్రారంభం

జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

ప్రజాశక్తి- సూళ్లూరుపేట :

తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ సందర్శనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేద్ర మోడీ సుమారు రూ.1800 కోట్ల ఖర్చుతో నిర్మించిన మూడు ప్రధానమైన అంతరిక్ష ప్రయోగాలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. ప్రధాని ప్రారంభించిన వాటిలో శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లో 'పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ' భవనం కూడా ఉంది. దీనితో పాటుగా మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో 'సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్‌టెస్ట్ ఫెసిలిటీ' విఎస్ఎస్‌సి వద్ద 'ట్రైసోనిక్ విండ్ టన్నెల్' కూడా ప్రధాని చేతులు మీదుగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. శ్రీహరికోటలోని పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ (పీఐఎఫ్) అందుబాటులోకి రావడంతో పీఎస్ఎల్‌వీ ప్రయోగాల సంఖ్యను పెంచడానికి దోహద పడుతుంది. ఏడాదికి 6 నుంచి 15 ప్రయోగాలు జరపడానికి వెసులుబాటు కలిగింది. ఈఅత్యాధునిక సదుపాయం ద్వారా ప్రైవేటు అంతరిక్ష సంస్థలు రూపొందించిన ఎస్-ఎస్ఎల్‌వి ఇతర చిన్న ప్రయోగ వాహనాల ప్రయోగానికి కూడా ఉపయోగపడుతుంది. ఇస్రో చైర్మన్ సోమనాథ్ సారథ్యంలో గగన్యాన్ ద్వారా అంతరిక్షంలోకి పంపడానికి భారత్ సిద్ధం చేసిన నలుగురు ఆస్ట్రోనాట్‌లను కూడా ఈ సందర్భంగా ప్రధానికి పరిచయం చేయడం జరిగింది.

వైసీపీ గెలిస్తే రౌడీ రాజ్యమే..

మీడియాతో ఎమ్మెల్సీ రామ్‌భూపాల్‌రెడ్డి

సమిష్టి కృషితో విజయం సాధిస్తామంటున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వైసీపీ మరోసారి గెలిస్తే రాష్ట్రంలో రౌడీలు రాజ్యమేలుతారని టీడీపీ ఎమ్మెల్సీ రామ్‌భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అధికార పార్టీ స్మగ్లర్‌కు సీటు కేటాయించిందని అతడిపై వంద కేసులున్నాయన్నారు. ఇలాంటి వారికి టికెట్ కేటాయించి రాష్ట్రంలో రౌడీ పాలన తీసుకురావాలని జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నుంచి చిత్తూరు అసెంబ్లీ స్థానం కోసం ఆరుగురు ప్రయత్నించినా అధిష్టానం ఆలోచించి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గురజాల జగన్‌మోహన్‌కు ప్రకటించినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా టీడీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని చిత్తూరులో విజయం సాధించి చంద్రబాబుకి బహుమతిగా ఇస్తామన్నారు. టికెట్ ఆశించిన అభ్యర్థిలందరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి గురజాల విజయం కోసం పని చేయనున్నట్లు సిఆర్ రాజన్, కఠారి హేమలత, కాజూరు బాలాజి తెలిపారు. సమావేశంలో మాజి ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు సురేంద్రకుమార్, కోదండయాదవ్‌లు పాల్గొన్నారు.

చిత్తూరు టికెట్టు బలిజలకే ఎందుకు: ఢిల్లీబాబు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీబాబు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో నలుగురు బలిజలు ఎంఎల్ఏ, ఎంపిగా ప్రాతినిధ్యం వహించారు. నియోజకవర్గంలో ఏం అభివృద్ధి సాధించారని తిరిగి బలిజలకు సీట్లు ఇవ్వాలని బలిజ సంఘం నాయకులు ఢిల్లీబాబు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఢిల్లీబాబు మాట్లాడుతూ చిత్తూరు నియోజవర్గంలో డికె అధికేశవులు, డిఏ సత్యప్రభ, ఎఎస్.మనోహర్, ఆరణి శ్రీనివాసులు ఎంఎల్ఏలుగా విజయం సాధించినా బలిజల అభివృద్ధితో పాటు చిత్తూరు నగరాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయాలేదన్నారు. ఒక్క గాంధీ విగ్రహం మార్పు మినహా.. ఇలాంటి నేతలు తిరిగి నిస్సిగ్గుగా బలిజలకు అన్యాయం జరిగిందని బలికే టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రజాసేవ చేస్తున్న ఎంసి విజయానందరెడ్డి విజయం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

తిరుపతి బహిరంగ సభను విజయవంతం చేయండి

- కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గిడుగు రుద్రరాజు

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: విభజన హామీలు, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ మార్చి 1వ తేదీ తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహించిన ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ వెంకన్న పాదాల చెంత తిరుపతిలో సమావేశం నిర్వహించి ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. వైసీపీ, కాంగ్రెస్ ఇరు పార్టీలు ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని తెలిపారు. తిరుపతిలో నిర్వహించే బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఐ జాతీయ నాయకులు నారాయణలను ఆహ్వానించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకులు, రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతిలో నిర్వహించే సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్, రాణి యాదవ్‌లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేళ 'పాలన' లేదా..?

- సమయానికి రారు.. అవసరానికి పలకరు..
- అధికారుల తీరుపై విస్తుపోతున్న ప్రజలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రభుత్వ కార్యాలయాలన్నీ 10గంటలకు ప్రారంభమవ్వాలి. ఆ సమయానికి ఉద్యోగులంతా తప్పనిసరిగా విధులకు హాజరుకావాలి. సమయపాలన పాటించి తీరాల్సిందేనని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉంది. సమయపాలన పాటించని అధికారులకు ఆ రోజంతా గైర్హాజరుగా నమోదు చేసే విధంగా అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి 10గంటలకు ఆ లొకేషన్‌లో ఫింగర్, ముఖ హాజరు ఉంటేనే హాజరైనట్లు గుర్తించే ఓ వ్యవస్థను రూపొందించారు. అయినా వెదురుకుప్పం మండలంలో మాత్రం అధికారులకు అవేమీ పట్టడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కార్యాలయాన్ని సహాయకులు తెరిచేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం తీరిగ్గా 11గంటలు ఆపై సమాయానికి కార్యాలయాలకు చేరుకుంటున్నారు. రోజూ ఇదే తంతు సాగుతోంది. మంగళవారం వెదురుకుప్పం మండలం వెలుగు కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఆఫీసు తలుపులు తెరుచుకున్నా.. అధికారులు మాత్రం సమాయానికి రాలేదు. అధికారుల కోసం వచ్చిన స్థానికులు 11గంటల వరకు వేచి ఉండాల్సి పరిస్థితి ఏర్పడింది. ఎన్నాళ్లకీ అధికారులు తీరు మార్చుకుంటారోనంటూ అక్కడికి వచ్చిన స్థానికులు ఒకింత విస్తుపోయారు. కనీసం ఉన్నతాధికారులైనా పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. ఇకనైనా అధికారులు సమాయానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఫీల్డ్ పైకి వెళ్లాం..

డ్వాక్రా గ్రూపుల్లో సమస్యలు ఉన్నాయి. అందువల్ల పచ్చికాపల్లంకి ఉదయాన్నే వెళ్లాం. పరిష్కారం తరువాత ఆఫీసుకి తిరిగొచ్చాం. సమాయానికి వచ్చేస్తాం.

- కవిత, ఎపీఎం, వెదురుకుప్పం మండలం

హంద్రీనీవా నీళ్లు పేరిట మరో మోసం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కుప్పం నియోజకవర్గంలో ప్రజానీకానికి హంద్రీ-నీవా నీళ్ళు తీసుకొచ్చామని ఆర్భాటంగా ప్రారంభించిన సీఎం ప్రజలను మోసం చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విమర్శించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణాజలాల నీళ్లను చిత్తూరు జిల్లాకు తీసుకొచ్చామని గొప్పగా చెబుతూ ప్రజలను మోసం చేయడం దారుణమఅన్నారు. కృష్ణా నదిలోనే నీళ్ల లేకపోతే అ కాలువలు నీళ్ల ఎలా వస్తాయని గతంలో అసంపూర్తిగా ఉన్న కాలవను పూర్తి చేసి నిధులు కేటాయించి పూర్తి చేయకుండా రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలు ఉన్నాయని కారణంతో హడావిడిగా రెండుసార్లు వాయిదాలు వేసిన సీఎం కార్యక్రమాన్ని అధికారులు తంటాలపడి నీటిని స్టోరేజ్ చేసి తాత్కాలిక గేట్లు పెట్టి కుప్పం నియోజకవర్గానికి వదిలామని చెప్పడం మోసం కాదా అని ప్రశ్నించారు. స్వయంగా సీఎం మోసకారి కార్యక్రమాలు చేయడం జిల్లా ప్రజలు అవాక్కవుతున్నారు. ఐదు సంవత్సరాలుగా మోసం చేస్తూనే ఉన్నా చివర్లో కూడా ప్రజలను మోసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. చిత్తశుద్ధిగా ప్రజలకు రైతులకు న్యాయం చేయాలనుకుంటే సమస్య పరిష్కరించి చెప్పాలని తెలిపారు. అంతేకాకుండా జిల్లా పర్యటన సందర్భంగా ఆర్టీసీ అన్ని బస్సులను సభలకు తరలించి ప్రజలకు రవాణా ఇక్కట్లు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. డబ్బులు మందు బిర్యాని పంపిణీ చేసి ప్రజలను తరలించడం వైసీపీ ప్రభుత్వానికి చెల్లుతుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు హడావుడి కార్యక్రమాలు ఆపి ప్రజలకు ప్రజా సమస్యలను పరిష్కారం చేసి దిశగా చివరి క్షణంలోనైనా ప్రయత్నాలు చేస్తే మంచిదన్నారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

13శాతం హంద్రీ నీవా పనులకు 57నెలలా..!

- 87శాతం టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తి
- ఎన్నికల ముందు మభ్యపెట్టేందుకే ప్రగల్భాలు
- మీడియాతో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-రామకుప్పం: 13శాతం హంద్రీ నీవా పనులు పూర్తి చేయడానికి వైసీపీ ప్రభుత్వానికి 57నెలలు పట్టిందా.. 87శాతం పనులు టీడీపీ హయాంలోనే పూర్తి చేశామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ హయాంలో హంద్రీనీవా కలువ పనులు పూర్తి చేశామని వైసీపీ నాయకులు చెప్పుకోవడం హాస్యాస్పందంగా ఉందన్నారు. 87శాతం పూర్తైయిన పనులను 57నెలలుగా సాగించిన వైసీపీ ప్రభుత్వం, కుప్పానికి కృష్ణా జలాలను ఇచ్చామని సీఎం జగన్ ప్రగల్భాలు పలికినా నిజానిజాలు ప్రజలే గుర్తిస్తారన్నారు. కుప్పంలో గత 35ఏళ్లుగా చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారని, మళ్లీ కుప్పం అభివృద్ధి ఒక్క టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి శాంతిపురం బహిరంగ సభలో మాట్లాడుతూ కుప్పంను అభివృద్ధి చేసింది మేమేనని చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించడంల ఉందన్నారు. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకురావాలని 1983లో దివంగత నేత ఎన్‌టీఆర్ మొదట ప్రపోజల్ పెట్టారన్నారు. చంద్రబాబు 2015లో హంద్రీనీవా జలాలను కుప్పం దాకా తీసుకుపోవాలని పనులు ప్రారంభించారన్నారు. 2019 నుంచి వైసీపీ నేతలు హంద్రీనీవా కాలువ పనులు చేయక కాలయాపన చేస్తూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నీటిని స్టోరేజ్ చేసి వదులుతున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ ప్రతిసారి కుప్పంను తామే అభివృద్ధి చేశామని ప్రగల్భాలు చెప్పుకోవడం కాదని, పులివెందులకు ఎంత నిధులు ఇచ్చారు.. కుప్పంకు ఎంత నిధులు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. సమావేశంలో నాయకులు మునస్వామి, ఆనంద్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, రామ్మూర్తి, సుబ్రీ, మనోహర్, రామలింగారెడ్డి, మహమ్మద్‌రఫీ, వెంకటరమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగయ్య మృతికి నివాళి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటకు చెందిన రంగయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ మీడియా కోఆర్డినేటర్ గురుశాల కిషన్‌చంద్ ఆ గ్రామానికి చేరుకొని రంగయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట బాబునాయుడు, శివరాంయాదవ్, మునిరాజారెడ్డి, మురళి తదితరులు ఉన్నారు.

'ఆలీ'ని కలిసిన వైస్ ఎంపీపీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సిని యాక్టర్ ఆలిని మండల వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి మంగళవారం మంగళగిరిలో కలిశారు. బూత్ లెవెల్ సమావేశంలో ఆయన కలిసి పార్టీ అభివృద్ధికి చేపడుతున్న విధివిధానాలను వివరించినట్టు శిరీష్‌రెడ్డి తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి శిరీష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిటిఎస్ లాప్ టెక్నీషియన్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని

విజయవంతం చేయండి: ఎంఈవో

ప్రజాశక్తి-సోమల: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని అన్ని పాఠశాలల్లో విజయవంతం చేయడానికి పాఠశాల సిబ్బంది సహకరించాలని ఎంఈవో శివరత్నమ్మ కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులచే వినూత్న రీతిలో నమూనాలను చేయించుకొని రావాలన్నారు. ప్రతి పాఠశాల నుండి రెండు నమూనాలను తప్పక చేయించుకుని సిఆర్‌సి పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ప్రదర్శనకు ఉంచాలని పాఠశాలల హెచ్ఎంలను కోరినట్లు ఆమె తెలిపారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని ఆరుమాకులపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు చిన్నబ్బనాయుడు(70) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టిడిపి నాయకులు కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, నియాజ్‌అలీ, నీరజాక్షులురెడ్డి, ప్రసాద్‌నాయుడు, శంకర్, పవన్‌నాయుడు, బాబునాయుడు పలువురు టిడిపి నాయకులు నివాళులర్పించారు.

నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-సదుం, సోమల: మండల పరిధిలోని ఊటుపల్లి, కంభంవారిపల్లి, చింతపర్తివారిపల్లి, అమ్మగారిపల్లి, తాటిగుంట పాల్యేం, సదుం, జోగివారిపల్లి, తిమ్మానాయునిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో పలు నూతన భవనాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధ వారం ప్రారంభించానున్నారని సదు జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సోమల మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు జెడ్పీ అమాస కుసుమ తెలిపారు.

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: అంగన్వాడీ టీచర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సీడీపీవో మాధవి లత అన్నారు. మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆన్‌లైన్ అప్లోడింగ్ చేయాలన్నారు. పలు అంశాలను సూచించారు. సూపర్వైజర్లు లతా, రమాదేవి మండలంలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దారి సమస్యపై ఘర్షణ

ప్రజాశక్తి-సదుం: మండలంలోని అరవపాలెంకు చెందిన రాసుపల్లి జయచంద్ర గత కొంత కాలంగా గుడి నిర్మాణం చేస్తున్నారు. ఈ క్రమంలో అగ్రకులస్థుల జాగాలో దళితుడు జయచంద్ర అక్రమంగా మట్టిని తోలాడని ఆగ్రహించిన జాగా యజమాని, మంగళవారం అతనితో ఘర్షణ పడగా, జయచంద్ర తలకు రక్త గాయాలు అయ్యాయి. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు.

9న జాతీయ లోక్ అదాలత్: సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మార్చి 9 నుండి మార్చి 16వ తేదీ వరకు రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి సి ఎస్ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి, ఇతర సెలవులు వరుసగా రావడం వల్ల రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ మార్పు చేసిందని తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులు, ప్రజలు మార్చి 16న జాతీయ లోకాదాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మార్పును గమనించి సహకారం అందించాలన్నారు.

గూడూరు టౌన్ : మార్చి 9 వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ ను మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వాయిదా వేస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ , 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం మంగళవారం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించు కోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఫల సరుకుల మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాత మూలి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు సాయం చేయడం ఎంతో తృప్తిగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ల సిరి గోపాల్ రెడ్డి , ఆడిటర్ రామ్మోహన్ రావు, నాసిన నాగులు, చోళవరం గిరిబాబు, రాఘవరెడ్డి , సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

కుప్పంకు చేరని 'హంద్రీ నీవా' కృష్ణా జలాలు..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, రామకుప్పం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుప్పం నియోజకవర్గ పరిధిలో ప్రజల తాగు, నీటి సాగు నీటి కష్టాలు తీర్చేందుకు ఆర్భాటంగా 560 కోట్లతో వ్యయంతో ప్రారంభించిన 'హంద్రీ నీవా' కృష్ణా జలాలు కుప్పంకు పూర్తి స్థాయిలో చేరుకోకపోవటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండలం రాజుపేట వద్ద సోమవారం సీఎం జగన్మోహన్ రెడ్డి కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చి నీటిని కుప్పం ప్రాంతం వైపు వదిలారు. ఈ కాలువలోనీ నీరు మంగళవారానికే శాంతిపురం సమీపంలోనే ఇంకిపోయి ఉండటంతో ప్రజల ఆశలు ఒక్కరోజులోనే ఆవిరైపోయింది. రూ.560కోట్ల ఖర్చుతో 672కి.మీ దూరంలోని కృష్ణా నది జలాలు.. గత కుప్పం నియోజకవర్గ పర్యటనలో ఇచ్చిన మాట ప్రకారం కప్పంకు విడుదల చేశామని సీఎం ప్రకటించారు. ఈ కాలువ నీటితో 110మైనర్ ఇరిగేషన్ చెరువుల ద్వారా 6300ఎకరాల భూమికి నీటి వసతి లభిస్తుందని సీఎం ప్రకటించారు. అయితే ఈ కాలువలో పూర్తి స్థాయిలో కృష్ణా జలాల రాలేదని.. ఎన్నికల లబ్ధి కోసం ఆగమేఘాలపై ప్రభుత్వం కుప్పం నియోజకవర్గంకు హంద్రీ నీవా జలాలు ఇచ్చామని చేతులు దులుపకుందని ప్రజలు భాహటంగా విమర్శిస్తున్నారు. గత టీడిపి ప్రభుత్వం 87శాతం హంద్రీ నీవా కాలువ పనులు చేపట్టగా.. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం 13శాతం పనులు చేసేందుకు 57 నెలల సమయం తీసుకుంది. 1983లో స్వర్గీయ మాజీ సీఎం నందమూరి తారకరామారావు రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్న తపనతో హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కింద ప్రారంభించారు. ఇదే విషయమై ఇరిగేషన్ ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడం గమనార్హం. రామకుప్పం మండలం చెందిన టిడిపి నేతలు హంద్రీనీవా కాలువలో జగనన్న నీలెక్కడ అంటూ ఆందోళనకు దిగారు.

'రాజన్న ఫౌండేషన్' విద్యా సంస్థలకు బెస్ట్ అవార్డు

ప్రజాశక్తి -రేణిగుంట: గల్లా రామచంద్ర నాయుడు, వారి కుటుంబ సభ్యుల ద్వారా నిర్వహిస్తున్న రాజన్న ఫౌండేషన్ ద్వారా గత 27 సంవత్సరాలుగా గ్రామీణ విద్యార్థిని విద్యార్థులకు సరసమైన ధరలకు నాణ్యమైన విద్యాభ్యాసాన్ని అందిస్తున్న అమర రాజా సంస్థల గ్రూప్ లో భాగమైన రాజన్న ఫౌండేషన్ విద్యా సంస్థలకు 'బెస్ట్ ఎడ్యుకేషన్ సపోర్ట్ ఇనిషియేటివ్ ఆఫ్ ది ఇయర్ 2024' అవార్డు లభించింది. ఢిల్లీలో పార్క్ హయత్ హోటల్లో బ్రాండ్ హానాక్ వారిచే ఇండియన్ సోషల్ ఇంపాక్ట్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో మంగళవారం ఈ అవార్డుని రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ అందుకున్నారు. ఈ అవార్డుని అందుకోవడం పట్ల రాజన్న ఫౌండేషన్ సంస్థల ఛైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక రకాల సేవా కార్యక్రమాల్ని గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని అందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు ప్రదేశాలలో విద్యా సంస్థలు నెల కొల్పి వందల మంది గ్రామీణ విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నా మన్నారు. తమ సేవా కార్యక్రమాలకి గుర్తింపుగా ఈ అవార్డు అందుకున్నం దుకు ఎంతో సంతోషంగానూ, ఇంకా సేవా కార్యక్ర మాలు ముందుకు తీసుకెళ్లడానికి స్ఫూర్తి నందిస్తుందని, ఈ అవార్డుని అందు కోవడానికి సహకరించిన రాజన్న ఫౌండేషన్ సిబ్బందికి విద్యార్థిని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శు భాకాంక్షలు తెలుపు తున్నామన్నారు.

పాలీసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి -సత్యవేడు: పాలిటెక్నికల్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించనున్న 2024 పాలీసెట్ ప్రవేశ పరీక్షలకు ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణులు అయిన వారు పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు అర్హులన్నారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభమై ఏప్రిల్ నాలుగో తేదీతో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 27వ తేదీన పాలీసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థిని, విద్యార్థులందరికీ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసిన వెంటనే ఏప్రిల్ ఒకటి నుంచి స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. దీంతో పాటు శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు అందరికి మెటీరియల్స్ అందిస్తా మన్నారు. మరిన్నివివరాల కోసం హెచ్‌టిటిపి ఎస్//అండ్‌బిటిఇటి. ఏపి.జివోవీ.ఐఎన్‌వెబ్‌సైటును సంప్రదించాలన్నారు. పాలిటెక్నికల్ డిప్లమో కోర్సులు పూర్తి చేసుకుంటున్న ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయన్నారు. పదవ తరగతి పూర్తి చేస్తున్న విద్యార్థులు అందరూ సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. దీనికి సంబంధించి డాక్టర్ కృష్ణంరాజు(8179433557),లోకేశులు(9492978378) మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపణలు అవాస్తవం: టిటిడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దాతల విజ్ఞప్తి మేరకు వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో ఈ నెల 25వ తేదీ టీటీడీ ఛైర్మన్, ఈవో ముంబయికి వెళ్లి శ్రీవారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారని, ఇందుకోసం టీటీడీ ఎలాంటి ఖర్చు చేయలేదని టీటీడీ యాజమాన్యం ప్రకటించింది. తిరుమలలో పది ఎలక్ట్రిక్ బస్సులను దాత విరాళంగా ఇచ్చారని, ఈ అంశంలో బోర్డు సభ్యులు నాగసత్యంకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయాలకు సంబంధించి టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపణలు చేసినట్లు ఒక దినపత్రికలో ప్రచురించిన వార్త పూర్తిగా అవాస్తవమని వెల్లడించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే విజ్ఞప్తి మేరకు హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా, దాతల విభాగంలో ఫిబ్రవరి 25వ తేదీన టీటీడీ ముంబయిలో శ్రీనివాస కళ్యాణోత్స వం ఏర్పాటు చేసింది. లక్ష మంది భక్తుల సమక్షంలో నిర్వహించే కళ్యాణోత్సవానికి టీటీడీ తరఫున ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని, ఈవో ఏవి.ధర్మారెడ్డిని దాతలు ఆహ్వానించారు. దాత సాయంతోనే ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. టీటీడీ 10 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసిందని, ఆ సంస్థకు నాగసత్యం డైరెక్టర్ అని ఆరోపించడం సత్యదూరం. వాస్తవానికి మేఘ కృష్ణారెడ్డి తన ఒలెక్ట్రా సంస్థ ద్వారా 10 ఎలక్ట్రిక్ బస్సులను భక్తుల సౌకర్యార్థం టీటీడీకి విరాళంగా అందించారు. నాగ సత్యంకు ఆ సంస్థకు ఎలాంటి సంబంధం లేదు. అయితే దినపత్రికలో వచ్చిన వార్తలో బస్సుల సరఫరాలో వాటా కోసమే నాగసత్యంకు ధర్మకర్తల మండలి పదవి కట్టబెట్టారని ఆరోపించడం సత్యదూరం. టీటీడీకి ఉచితంగా వచ్చిన బస్సులపై కూడా అవాస్తవాలను ప్రచారం చేయడం దాతల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని టిటిడి యాజమాన్యం పేర్కొంది.

ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీలోనే స్థలాలు ఇవ్వండి: సిపిఎం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని పేద ప్రజలకు ఇచ్చిన జగనన్న ఇళ్ల పట్టాలకు స్థానికంగానే స్థలాలు చూపాలని కోరుతూ మంగళవారం సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు వేణుగోపాల్, బుజ్జి ఆధ్వర్యంలో తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్, బుజ్జి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం జగనన్న నవరత్నాల్లో భాగంగా ఇళ్ల పట్టాలను ఇవ్వడానికి నిర్ణయించిందని, అయితే కొన్ని ప్రాంతాల్లో పట్టాలు మాత్రం ఇచ్చి స్థలాలు చూపలేదని విమర్శించారు. ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీలో దాదాపు 2,500 కు పైగా జగనన్న ఇళ్ల పట్టాలు ఇచ్చారని, మూడేళ్లు కావస్తున్న స్థలాలు చూపకపోవడంతో పోరాటాలు చేసామన్నారు. ఉమ్మడి శెట్టి పల్లె పంచాయతీలో జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన వారికి ఎక్కడో సుదూర ప్రాంతమైన చిందేపల్లిలో స్థలాలు ఇవ్వడం సరికాదని, మంగళం పరిధిలోని నూతనంగా ఏర్పడ్డ తిరుమల నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 195/2, 195/4లోని 41 ఎకరాల భూమిలో లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొదట్లో సర్వే నెంబర్లలో జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేసినా ఆ తర్వాత జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ స్థలాన్ని సర్వే ట్రైనింగ్ అకాడమీకి బదలాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. నిర్ణయం తీసుకున్న నాటి నుండి నేటి వరకు ఈ స్థలంలో ఎలాంటి కార్యకలాపాలు ప్రారంభించలేదని, జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన వారికి ఇక్కడే స్థలాలు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మోదీన్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మీరాంబీ, కుమారి, జానకి, అములమ్మ పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఎంప్లాయీస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు పరీక్షల మూల్యాంకన కేంద్రంలో (స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా సమీపంలో) రెండు పోలింగ్ బూత్ లలో జరుగనున్నాయి. మొత్తం ఈ ఎన్నికలలో 9 మంది డైరెక్టర్ల కు 18 మంది అభ్యర్థులు పోటీలో వున్నారు. ఈ ఎన్నికలలో మొత్తం 581 ఓటర్లు వున్నారు. ఒక ఓటరు గరిష్టంగా 9 మంది డైరెక్టర్ల కు ఓటు వేయవచ్చును. పోలింగ్ ముగిసిన తరువాత వెంటనే కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. విజేతలను అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఇందులో గెలిచిన 9 మంది అభ్యర్థులు వారిలోనే ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకుంటారు. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇక ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరగడానికి అభ్యర్థులు, సభ్యులు సహకరించాలని ఎన్నికల అధికారి యనమల లోకనాధం తెలిపారు. టెక్నికల్ స్టాఫ్ సిబ్బంది ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు అందజేత

ప్రజాశక్తి- ఏర్పేడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి 'పేదలందరికీ ఇల్లు కార్యక్రమం' ద్వారా జగనన్న కాలనీలో లబ్ధి పొందిన లబ్ధిదారులకు పాపా నాయుడుపేట గ్రామ సచివాలయంలో సర్పంచ్ మేకలత్తూరు లలితా కరుణాకర్ అధ్యక్షతన ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించి, వారికి ఇళ్ల పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం హరికృష్ణ, వీఆర్వో జైపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేద్దాం: బాలాజీ

ప్రజాశక్తి-సోమల: సమిష్టి కృషితో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారి బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుండి ఐదు ఏళ్ల లోపు చిన్నారులకు తప్పక రెండు చుక్కల పోలియో చుక్కలను వేయించాలని కోరారు. పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య పరిధిలోని 12పోలింగ్ బూత్‌లలో 48మంది టీమ్ మెంబర్లు, ఇద్దరు సూపర్వైజర్లు,1002 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ హాల్ టికెట్‌తో

గ్రూప్-2కు హాజరు

- గుర్తించి అదుపులోకి తీసుకున్న అధికారులు
- కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు

ఇమాన్యుయల్ అరెస్టును చూపుతున్న డిఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గ్రూప్-2 ప్రిలిమినరీ స్క్రీనింగ్ పరీక్షకు నకిలీ హాల్ టికెట్‌తో కర్నూలు నుంచి పరీక్ష రాయుటకు చిత్తూరుకు వచ్చిన అభ్యర్థి ఇమ్మనియల్‌పై కేసునమోదు అరెస్టు చేసి నకిలీ హాల్ టికెట్ తయారు చేయుటకు ఉపయోగించిన కంప్యూటర్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గత సంవత్సరం నవంబర్ నేలలో ఎపిపిఎస్‌సి రాష్ట్ర వ్యాప్తముగా నిర్వహించినారు, కమిషన్ పరీక్షకు సంబంధించి అభ్యర్థుల నుంచి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అభ్యర్థులకు హాల్ టికెట్‌లను జారి చేసినారు. సదరు హాల్ టికెట్ లను ఎపిపిఎస్‌సి యొక్క అధికారిక వెబ్ సైట్ లో నుండి అభ్యర్థి యొక్క వ్యక్తిగత వివరములతో డౌన్లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావలసి ఉంటుంది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా, క్రిష్ణగిరి మండలం, కంబాలపాడు గ్రామానికి చెందిన మారప్ప కుమారుడు . సుదర్శనం అను అతను, డోన్ పట్టణంలో రాజ కాంప్లెక్స్ లో ఉన్న మీసేవ కేంద్రంలో పని చేస్తున్న వరుసకు తమ్ముడు అయిన ఇమ్మనుఎల్ అను అతని వద్ద అతని వ్యక్తిగత వివరములు మరియు అప్లికేషన్ ప్రాసెస్ నగదు చెల్లించి, అతని పై నమ్మకంతో ఆన్లైన్ లో గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షకు దరఖాస్తు చేయమని కోరడం జరిగినది. కాని, ఇమ్మనుఎల్ వారి మధ్య ఉన్న వ్యక్తిగత వైషమ్యాలను మనసులో ఉంచుకొని సుదర్శనం ను మోసం చేయాలనే ఉద్దేశ్యంతో యొక్క ఆన్లైన్ దరఖాస్తు చేయకుండా ఉన్నాడు. నకిలీ హాల్ టికెట్‌తో చిత్తూరులో పరీక్ష రాసేందుకు ఇమాన్యుయల్ వచ్చారు. నారాయణ కళాశాల వద్దకు చేరుకొని నకిలీ హాల్ టికెట్ చూపించడంతో ఈ కేంద్రంలో గ్రూప్ -2 పరీక్షా కేంద్రం కాకపోవడంతో ఫేక్ హాల్‌టికెట్‌గా గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు ఇమాన్యుయల్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్, గంగాధరనెల్లూరు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జీడి నెల్లూరు మండలం పెద్దకాలువ పంచాయితీ, చెర్లోపల్లి వద్ద వెలుగు చూసింది. రాబడిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకొన్న తమ సిబ్బంది ఓ గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని గుర్తించిన్నట్లు డిఎస్‌పి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, అతడి తలపై బలమైన గాయం కావడంతో వ్యక్తి మృతి చెందిన్నట్లు తెలుస్తోందన్నారు. మృతుడు సిమెంట్ రంగు ఫ్యాంటు, రజినీకాంత్ బొమ్మ ఉన్న టీషర్టు ధరించిన్నట్లు గుర్తించామన్నారు. అనుమానిత వ్యక్తగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు జీడి నెల్లూరు పోలీస్‌స్టేషన్, డిఎస్పీ చిత్తూరుకు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

PUBLIC NOTICE

The general public are hereby informed that Sri Yandamuri Nagendra Babu S/o Late Y.Sathya Narayana has approached M/s Shriram Finance Ltd Himayatnagar Branch Hyderabad for depositing her title deeds under Sale Deed Doc No.982 of 2018 Dt 18-04-2018 by way of equitable mortgage in respect of schedule property for securing her future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned to Sri Yandamuri Nagendra Babu S/o Late Y.Sathya Narayana and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that the part and parcel of Vacant site admeasuring 400 Sq.yds equivalent to Ac 00-05 cents in sy.No.33-3 Situated at Chandragiri (Village & GP), Chandragiri (Mandal), Chittoor District, Andhra Pradesh State, and Bounded as Follows:-
North Road
South Open site of G. Raja Reddy
East Open Site of G. Raja Reddy
West Plot No.1 in Srinivasa Nagar Phase-1, Plot No. 20 in Phase No.2

For NomosVistas, The Lawyers,
Govardhan Venu,
Advocate & CEO
C-701 Skyline & Sterling Residency,
Basheerbagh, Hyderabad 29.
Mob:-9849091266